సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం, 18, అక్టోబర్, 2023



చంద్రఘంటా దేవిగా జోగుళాంబ

జోగుళాంబ అమ్మవారు మంగళవారం చంద్రఘంటా దేవిగా దర్శనమిచ్చారు.

వివరాలు 10లో ▸



విస్తృతంగా పోలీసుల తనిఖీలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు కొనసాగిస్తున్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.4 /22.1

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కాస్త ఎండగా ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

సారొస్తున్నారు..

నేడు జడ్చర్లలో ప్రజా ఆశీర్వాద సభ



- హాజరుకానున్న 'గులాబీ' దళపతి, సీఎం కేసీఆర్
- ఉమ్మడి పాలమూరులో ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం
- సుమారు లక్ష మంది జనసమీకరణ
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు.. సర్వం సిద్ధం
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్వీయ పర్యవేక్షణ
- వరాల జల్లు కురిపించేనా.. జడ్చర్ల రెవెన్యూ డివిజన్ కల నెరవేరేనా?



సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బుధవారం జడ్చర్ల వేదికగా ప్రజా ఆశీర్వాద సభతో ఉమ్మడి పాలమూరులో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేతలు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దగ్గరుండి సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అనంతరం ఉమ్మడి జిల్లాలో తొలిసభ నిర్వహిస్తున్న క్రమంలో నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించేలా జనసమీకరణకు సన్నాహాలు మొదలుపెట్టారు. కల్వకుర్తి రూట్‌లో పట్టణ శివారులోని గంగాపూర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఏర్పాట్లు చేస్తున్న సభకు సుమారు లక్ష మంది వరకు హాజరవుతారని నేతలు అంచనా వేస్తున్నారు.

'పాలమూరు' వేదికగా పాగా వేసేలా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత ఎన్నికల్లో 13 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) అభ్యర్థులు గెలుపొందారు. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి సైతం ఆ తర్వాత పరిణామ క్రమాల్లో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ ఎన్నికల్లో సైతం అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీల కంటే ముందస్తుగా కేసీఆర్ పార్టీ అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి పాలమూరులోని అన్ని స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలనే అభ్యర్థులుగా ఖరారు చేస్తూ ఆగస్టు 21న జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే.

హామీ నెరవేరుతోందంటూ..

2018 ఎన్నికల సందర్భంగా నవంబర్ 21న సీఎం కేసీఆర్ జడ్చర్లకు రాగా.. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి కరువు జిల్లాగా పేరుగాంచిన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 20 లక్షల ఎకరాలకు, ఉదండాపూర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి జడ్చర్ల నియోజకవర్గంలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఈ నియోజకవర్గంలోని ప్రతి గిరిజన తండాకు బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. త్వరలో కృష్ణా జలాలు రానున్నందున ప్రతిష్టాత్మక హామీ నెరవేరుతోందని.. అన్ని అడ్డంకులను దాటి ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుస్తున్నామంటూ కేసీఆర్ పాలమూరులో ప్రజా ఆశీర్వాద సభలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టినట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. దీంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు ఎలాంటి లోటు పాట్లు లేకుండా సభ సజావుగా సాగేలా దగ్గరుండి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆ తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందనే ప్రచారం ఊపందుకున్న క్రమంలో సెప్టెంబర్ 16న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్లపూర్ వద్ద పంప్‌హౌస్‌లో మొదటి మోటారును స్విచాన్ చేసి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని (పీఆర్‌ఎల్‌ఐఎస్) ప్రారంభించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాను సస్యశామలం చేసే ఈ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయడాన్ని బట్టి పాలమూరు వేదికగా దక్షిణ తెలంగాణలో సత్తా చాటేలా సీఎం కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు స్పష్టమవుతోంది.

వరాల జల్లు కురిపించేనా..

జడ్చర్లకు సీఎం కేసీఆర్ రానున్న సందర్భంగా ఎలాంటి హామీలు గుప్పిస్తారనే దానిపై నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, జడ్చర్లకు బైపాస్ రోడ్డు నిర్మించాలనే డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది. అదేవిధంగా మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కోడ్గల్‌ను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

జంగ్ తెలంగాణ

26న అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లో..

బుధవారం జడ్చర్లలో మధ్యాహ్నం, మేడ్చల్‌లో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్న సీఎం కేసీఆర్.. ఈ నెల 26 నుంచి మళ్లీ జిల్లాల పర్యటన కొనసాగించనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి 26న అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లో.. అనంతరం వచ్చే నెల ఆరో తేదీన గద్వాల, మక్తల్, నారాయణపేటలో జరగనున్న సభల్లో ఆయన పాల్గొననున్నారు.



సీఎం కేసీఆర్ సభకు ముస్తాబయిన వేదిక

మళ్లీ కేసీఆరే సీఎం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయంతో హ్యాట్రిక్ సాధిస్తామని.. మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి ఆయన మంగళవారం జడ్చర్ల శివారులో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను, ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చింది, అభివృద్ధి చేసింది కేసీఆరేనని పునరుద్ఘాటించారు. తమ మేనిఫెస్టో సబ్బండ వర్గాల ప్రజలకు ఎంతో దగ్గరగా ఉందన్నారు. జెడ్పీ వైస్ చైర్మెన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు మొత్తంగా మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్సెస్సీలో 122 మంది విద్యార్థులకు 104 మంది, ఇంటర్‌లో 107 మందికి 93 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాకేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు పరీక్ష కేంద్రాన్ని డీఈఓ రవీందర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

యోగా పోటీల్లో పతకాలు సాధించాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో క్రీడాకారులు పతకాలు సాధించాలని డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు మంగళవారం బయలుదేరారు. ఈ సందర్భంగా మెయిన్ స్టేడియంలో క్రీడాకారులను డీవైఎస్‌ఓ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు, జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రావు, పీఈటీలు సుచేతన్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

సదాశివపేటకు తరలిన అండర్-19 కబడ్డీ జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో కబడ్డీ జట్లను అండర్–19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, ప్రిన్సిపాల్ భగవంతాచారి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలవాలని కోరారు. క్రీడాజట్లకు వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి క్రీడా దుస్తులు అందజేశారు.



హంస ధాన్యం ధర రూ.2,296

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన టెండర్లలో హంస ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,296 ఒకే ధర నమోదైంది. మార్కెట్‌లో లావాదేవీలు చాలా తక్కువ మొత్తంలో జరిగాయి. మరోవైపు బుధవారం ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ధరలు పెరగడం వల్ల గత సీజన్‌లో పండిన ఉల్లిని చాలా మంది రైతులు నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం నిల్వ చేసిన ఉల్లినే అమ్మకానికి తెస్తున్నారు.

మా 'కల' నెరవేర్చండి..

- సీఎం కేసీఆర్ రాకపై ఆశలు
- జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలి
- నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి
- వివిధ వర్గాల నుంచి విజ్ఞప్తుల వెల్లువ

ప్రజా ఎజెండా

జడ్చర్ల: సీఎం కేసీఆర్ జడ్చర్ల పర్యటనపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల సభలో పాల్గొననున్నందున ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా వరాలు గుప్పిస్తారని వివిధ వర్గాల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పీఆర్‌ఎల్‌ఐ ద్వారా సాగు నీరందించాలని డిమాండ్ చేస్తున్నారు. బీసీ బంధు కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షలు ఇవ్వాలని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోయిన వారు తమకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించేలా ప్రకటన చేయాలని కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా మార్చడంతో పాటు కొత్తగా రూరల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెవెన్యూ డివిజన్ చేయాలి



రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు జడ్చర్ల అన్ని విధాల అర్హత కలిగి ఉంది. డివిజన్ ఏర్పాటుతో అధికారులు ప్రజలకు మరింత దగ్గరగా సేవలు అందించే వీలుంటుంది. కొన్ని సంవత్సరాలుగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ బహిరంగసభలో రెవెన్యూ డివిజన్‌పై ప్రకటన చేయాలి.

– నడిమింటి శ్రీను, బీసీ సంఘం నాయకుడు

2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి



పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు సంబంధించి సేకరించిన తమ భూములకు 2013 చట్టం ప్రకారంగా పరిహారం ఇవ్వాలి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని తక్షణమే అమలు చేయాలి. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బాలకృష్ణ, రైతు సంఘం నాయకుడు

నిరుద్యోగ భృతి కల్పించాలి



నిరుద్యోగ భృతికి సంబంధించి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్వయంగా సీఎం కేసీఆర్ జడ్చర్లలో ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు దాన్ని నెరవేర్చలేదు. ఇప్పటికైనా నిరుద్యోగులకు స్పష్టమైన హామీ ఇచ్చి ఓట్లు అడగాలి.

– శివకుమార్, నిరుద్యోగి, కావేరమ్మపేట

బీసీ బంధు రూ.10 లక్షలు ఇవ్వాలి



దళితులకు ఇచ్చిన విధంగానే బీసీలకు బీసీ బంధు రూ.10 లక్షలు ఇవ్వాలి. దీంతో బీసీల జీవనోపాధి మెరుగుపడుతుంది. వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలి. బీసీ విద్యార్థులందరికీ ప్రత్యేక విద్యావసతులు కల్పించాలి.

– గోవర్దన్, రియల్ వ్యాపారి

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



ప్రధానంగా పట్టణంలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తదితర సమస్యల పరిష్కారానికి అత్యధిక నిధులు కేటాయించాలి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.

– రాములు, జడ్చర్ల



జడ్చర్ల వెంకటేశ్వర కాలనీ వాసులు

కౌంటింగ్ కేంద్రాల ప్రతిపాదనలు పంపండి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈనెల 18వ తేదీలోగా పంపిణీ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల ప్రతిపాదనలను పంపించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రిటర్నింగ్ అధికారులతో ఆయన వీసీ నిర్వహించారు. అన్ని స్థాయిల్లో ఎన్నికల విధులకు నియమించిన అధికారులు, సిబ్బందికి శిక్షణ ప్రారంభించాలని సూచించారు. స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాల ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో తయారు చేసి బుధవారం లోగా పంపించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమయ్యే వాహనాలతో పాటు ఆయా బృందాలకు అవసరమయ్యే వాహనాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి కోసం టెండర్ ప్రక్రియను చేపట్టాలన్నారు. నియోజకవర్గాల వారీగా కమ్యూనికేషన్ ప్రణాళికతో పాటు జిల్లా ఎన్నికల ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఫారం 13డీ ముద్రణ కోసం ప్రింటింగ్ ప్రెస్‌ల గుర్తింపు అంగన్‌వాడీల ద్వారా ఓటర్లకు ఫారం 12డీని పంపించాలన్నారు. వీటిని నిర్ధారణ చేసేందుకు సీడీపీఓలను సూపర్‌వైజర్ల అధికారులుగా నియమించాలన్నారు. పీఓలు, ఏపీఓల రాండమైజేషన్‌కు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల సందర్భంగా నియమించిన వివిధ తనిఖీ బృందాలు సీజర్‌పై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల శాతం పెరిగే విధంగా చర్యలు తీసుకునేందుకు అవగాహన పెంచాలని ఆదేశించారు. వీసీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మోహన్‌రావు, అనిల్‌కుమార్, నటరాజు తదితరులు పాల్గొన్నారు

రైతులను మోసం చేయొద్దు

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ధాన్యం కొనుగోలులో వివిధ రకాల నిబంధనలతో మోసం చేయవద్దని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీహాల్‌లో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంతో ఎలాంటి ఎజెండా లేకుండా కేవలం గంటలో సమావేశం ముగిసింది. వ్యవసాయం, విద్యుత్, వైద్యశాఖపై చర్చించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ తాలు పేరిట రైతులను మోసం చేయవద్దని నిబంధనల ప్రకారం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కోతల సమయంలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రోగులతో వైద్య సిబ్బంది మానవత్వంతో వ్యవహరించాలన్నారు. ఆపదలో వచ్చే వారికి సహాయం చేయాలే గానీ.. కసురుకోవడం సరికాదని సూచించారు. వైద్య సిబ్బంది మాట తీరును మెరుగుపరుచుకోవాలన్నారు. వైస్ చైర్మన్ యాదయ్య మాట్లాడుతూ.. అధిక లోడ్‌వల్ల గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని సరిచేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, జెడ్పీ సీఈఓ జ్యోతి జెడ్పీటీసీలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, కల్యాణి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నాగార్జునరెడ్డి, కోఆప్షన్ సభ్యులు అన్వర్, అల్లాఉద్దీన్ పాల్గొన్నారు.

తొలి సభకు ఏర్పాట్లు ఇలా..

జడ్చర్ల: ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం కేసీఆర్ తొలి ఎన్నికల ప్రచార సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జడ్చర్ల–గంగాపూర్ ప్రధాన జాతీయరహదారి 167ను అనుసరించి శివాలయం వెనుక ప్రాంతంలో బహిరంగసభను నిర్వహిస్తున్నారు. వేదిక వెనుక దాదాపు వంద మీటర్ల దూరంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. సభాస్థలికి పక్కగా వీఐపీ గ్యాలరీ, వేదిక ముందు మహిళలకు ప్రత్యేక గ్యాలరీ కూడా ఏర్పాటు చేశారు.

- సభకు వచ్చే వాహనాలను నిలిపేందుకు గంగాపూర్ రహదారి పక్కన సభాస్థలికి కొద్ది దూరంలో వాసవీ కల్యాణ మండపం చుట్టుపక్కల ఏర్పాటు చేశారు. మరో పార్కింగ్‌ను ఇదే రహదారికి అవతలి వైపున పెట్రోల్‌బంక్ వెనుక గల వెంచర్‌లో ఏర్పాటు చేశారు. సభా వేదికకు వంద మీటర్ల దూరంలో వీఐపీ పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతామని సీఐ రమేశ్‌బాబు తెలిపారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు బిజినేపల్లి, భూత్పూర్ మీదుగా వెళితే ట్రాఫిక్ ఇబ్బందులు కలిగే పరిస్థితి లేదని పోలీసులు సూచిస్తున్నారు.
- డీఐజీ చౌహాన్, ఎస్పీ హర్షవర్ధన్‌లు బహిరంగసభస్థలాన్ని పరిశీలించారు. సభకు వచ్చే జనానికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రేమ్ రంగా గార్డెన్‌లో బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించి.. తగు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీతో పాటు ఆరుగురు ఏఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలతో పాటు దాదాపు 700 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. డీఐజీ వెంట ఏఎస్పీపీ రాములు, డీఎస్పీ మహేశ్‌గౌడ్, తదితరులున్నారు.
- జడ్చర్ల పట్టణం మొత్తం గులాబీమయంగా మారింది. ప్రధాన కూడళ్లు స్వాగతతోరణాలు, కటౌట్లుతో నిండిపోయాయి. సభా ప్రాంగణంలో భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు.

నియమావళి అమలు పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

జడ్చర్లటౌన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలై నియమావళి అమలులో ఉన్నందున పర్యవేక్షణ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్, జడ్చర్ల అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు తనిఖీ బృందాలకు సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, ఎంసీసీ, వీఎస్‌టీ బృందాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. బృందాల విధులు, బాధ్యతలు వాటి అమలుపై సందేహాలు నివృత్తి చేసి క్షేత్రస్థాయిలో చేయాల్సిన పనుల గురించి వివరించారు.

- జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వాటిలో 139 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లు గర్తించామని రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,12,394 మంది ఉన్నారని తెలిపారు. ఈ నెల 30 వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఉండటంతో మరింత మంది ఓటర్లు పెరిగే ఆస్కారం ఉందన్నారు. నవాబుపేట మండలంలో 53, రాజాపూర్ 26, బాలానగర్ 39, జడ్చర్ల 103, మిడ్జిల్ 31, ఊర్కొండ 22 పోలింగ్ కేంద్రాలున్నాయని, అన్ని స్టేషన్లలో సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కొన్ని కేంద్రాల్లో ర్యాంప్‌ల నిర్మాణం చేయిస్తున్నామని, నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో 29 రూట్లుగా విభజించామన్నారు. సమీక్షలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేఎస్పీ నీటిమట్టం 31.5 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర ప్రాజెక్టు నీటి మట్టం మంగళవారం సాయంత్రం వరకు 31.5 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా మరో 1.1 అడుగు దూరంలో ఉంది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు కుడి, ఎడమ కాల్వల ద్వారా వానాకాలం పంటల కోసం నీటిని విడుదల కొనసాగిస్తున్నారు.





జయ జయహే దుర్గమ్మ..

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. మహిళలు వివిధ రూపాల్లో అమ్మవారిని కొలిచి.. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని వీరన్నపేటలోని చౌడేశ్వరి ఆలయంలో గాయత్రీదేవిగా జడ్చర్లలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్కంద మాతగా అమ్మవారు దర్శనమిచ్చారు.

- వివరాలు 11లో..

విస్తృతంగా పోలీసుల తనిఖీలు


పెద్దమందడి మండలం వెల్టూరు చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన నగదును చూపిస్తున్న పోలీసులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.63.40 లక్షల నగదు సీజ్

మహబూబ్‌నగర్ క్రైం/ గద్వాల క్రైం/వనపర్తి/ నవాబుపేట/ వంగూరు/ ఉప్పునుంతల/ మన్ననూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తుండటంతో పెద్దమొత్తంలో నగదు, మద్యం పట్టుబడుతోంది. ఈ క్రమంలో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.17.11 లక్షలు పట్టుబడ్డాయి. టూటౌన్ పరిధిలో రూ.5.50 లక్షలు కాగా.. రూరల్ పరిధిలో రూ.11.61 లక్షలు పోలీసులు సీజ్ చేశారు. అలాగే నవాబుపేట మండలం కొల్లూరు సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా లభించిన రూ.1.4 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని శ్రీశైలం హైవే చౌరస్తాలో ఎస్‌ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.10 లక్షలు పట్టుబడ్డాయి. అలాగే ఉప్పునుంతలలోని కేజీబీవీ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన తనిఖీల్లో రూ.1.22 లక్షలు పట్టుబడినట్లు ఎస్‌ఐ గురస్వామి తెలిపారు. ఈ నగదుకు సంబంధించి బాధితుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల అధికారికి అప్పగించామని చెప్పారు. మన్ననూర్ వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు అమ్రాబాద్ ఎస్‌ఐ వీరబాబు పేర్కొన్నారు.

■ జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో రామకృష్ణ అనే వ్యక్తి వద్ద రూ.3 లక్షలు, మితేష్ కుమార్ వద్ద రూ.1.27 లక్షల నగదుకు ఎలాంటి ఆధారం లేకుండా తీసుకెళ్తుండటంతో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. అలాగే మండలంలోని సంగాల పార్కు సమీపంలో సందీప్ అనే వ్యక్తి నుంచి రూ.93,500, రామాంజనేయులు వద్ద రూ.63 వేలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా అనంతపురంలో గట్టు నగేష్ అనే వ్యక్తి కిరాణ దుకాణంలో తనిఖీ చేయగా రూ.3,200 విలువ గల మద్యం, గద్వాలలో ఉమేష్ అనే వ్యక్తి వద్ద రూ.5 వేల విలువ గల మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.


వంగూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

■ వనపర్తి జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం రూ.27.20 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి తెలిపారు. పెద్దమందడి మండలంలోని వెల్టూరు చెక్‌పోస్టు వద్ద రూ.26.50 లక్షలు, అమరచింత పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే గోపాల్‌పేట, చిన్నంబావి, రేవల్లి, పాన్‌గల్ మండలాల్లో అక్రమంగా నిల్వ చేసిన 79 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు.


కోస్గి పరిధిలోని తిమ్మాయిపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


గద్వాల మండలం చెనుగోనిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ అభ్యర్థి సరిత

కదన రంగంలోకి..

జంగ్ తెలంగాణ

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడం, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎమ్మెల్యే స్థానాలకు తమ అభ్యర్థులను ఖరారు చేసింది. దీంతో ఆయా అభ్యర్థులు, బంధువులు, నాయకులు, కార్యకర్తలు తమదైన శైలిలో ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. ఎక్కడికక్కడ ఓటర్లను కలుస్తూ తమ వారిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే చేసే అభివృద్ధి వివరిస్తూ ఆకట్టుకుంటున్నారు. – సాక్షి నెట్‌వర్క్


అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లితండాలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి మంజుల


జడ్చర్లలో ఆరు గ్యారెంటీ పథకాలను వివరిస్తున్న అనిరుధ్‌రెడ్డి


మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నదర్పల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి

నవాబుపేట: మద్యం మత్తులో వ్యక్తి కింద పడి మృతి చెందిన ఘటన మండలంలోని పుట్టోనిపల్లితండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ పురుషోత్తం కథనం ప్రకారం.. నారాయణపేట మండలం దామరగిద్దకు చెందిన కడెం శ్రీనివాసులు(32) మద్యం మత్తులో పుట్టోనిపల్లితండాలో కిందపడి మృతి చెందాడు. అతను వారం రోజుల క్రితం భార్యకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆరోజు నుంచి కుటుంబ సభ్యులు వెతికినా అతని ఆచూకీ లభించలేదు. బంధువుల ద్వారా భార్యకు సమాచారం అందించారు. వెంటనే ఆమె వెళ్లి చూడగా తన భర్తనే చనిపోయినట్లు గుర్తించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతని భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: లారీ ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కుమ్మెర గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మెరకి చెందిన పల్లె బంగారమ్మ(30), మల్లయ్య వ్యవసాయ పొలంలో కూలి పనులకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న పల్లె బంగారమ్మ కింద పడటంతో ఆమె తలపై నుంచి లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతిరాలి భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

రాజాపూర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజాపూర్ సమీపంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూసేసరికి అతడు ప్రమాదం జరిగిన స్థలంలోనే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు జాతీయ రహదారి పక్కన ఉన్న పరిశ్రమలో పనిచేసే కార్మికుడుగా స్థానికులు వివరించారు. ఈ విషయంలో మృతుడి ఆచూకి కోసం ఆరా తీస్తున్నట్లు పోలీసులు వివరించారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం సాయంత్రం వరకు పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,250 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 1,250, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 15, భీమా ఫేజ్–2 ద్వారా 852, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

చంద్రఘంటా దేవిగా జోగుళాంబ అమ్మవారు


నవావరణ అర్చన చేస్తున్న అర్చకుడు


ఆలయంలో కోలాట ప్రదర్శన

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ పుణ్యక్షేత్రంలోని శక్తిపీఠమైన జోగుళాంబ అమ్మవారు నవరాత్రుల్లో భాగంగా మంగళవారం మూడో రోజు చంద్రఘంటా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుని కుంకుమార్చనలు, నవావరణ అర్చనలు, త్రిశతి, ఖడ్గమాల, చండీ హోమాలు, రుద్రాభిషేకాలు చేశారు. త్రికాల సమయాల్లో బలిహరణలు, మహానైవేద్యాలు, రథోత్సవాలు, కుమారి, సువాసిని పూజలు నిర్వహించారు.

108 రకాల ఘంటానాథాలు..

అమ్మవారు మహిషాసుర సంహారంలో భాగంగా ఘంటానాథాన్ని కూడా ఒక ఆయుధంగా వాడుతారు. అమ్మవారు ఉగ్రరూపంతో ఆలపించే ఘంటానాథం రాక్షసుల మనసు కకలావికలం అవుతూ నీరసించి పోతారు. దీంతో అమ్మవారు రాక్షస సైన్యాన్ని సంహరిస్తుంది. సంహారం అనంతరం జగన్మాత ఘంటానాథాన్ని వినసొంపుగా మోగించడంతో సకల జీవప్రాణికోటి శ్రావ్యంగా వింటారని, అందుకే ఉత్తర భారతదేశంలో నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజు 108 రకాల ఘంటానాథాలను ఆలపించడం ఒక ఆనవాయితీగా వస్తుందని అర్చక స్వాములు తెలియజేశారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్యలు పర్యవేక్షణ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజన ప్రసాదాలు స్వీకరించారు.


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

చిరుధాన్యాల పంటకు అనువైనది


నాగిసోనిపల్లిలో పంటలను పరిశీలిస్తున్న కేంద్రబృందం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా చిరుధాన్యాల పంటల పెంపకానికి అన్ని రకాల అనువైనదని కలెక్టర్ రవి నాయక్ అన్నారు. వన్ ప్రాజెక్టు వన్ డిస్ట్రిక్ట్ కింద జాతీయ స్థాయిలో జిల్లా చిరుధాన్యాల పంటలకు ఎంపికైన నేపథ్యంలో మంగళవారం కేంద్ర బృందం కలెక్టరేట్‌లో ఆయనను కలిశారు. చిరుధాన్యాల పెంపకంపై చర్చించారు. చిరుధాన్యాల పంటలు పెంచేందుకు అన్ని రకాలుగా ఇక్కడి భూములు, వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. వ్యవసాయం అనుబంధ శాఖల సహకారంతో జిల్లాలో చిరుధాన్యాల పంటలను ప్రోత్సహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా చిరుధాన్యాల పెంపకానికి ఒరిస్సా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎంపిక కాగా, తెలంగాణలో మహబూబ్‌నగర్ ఎంపిక కావడం విశేషమన్నారు. భవిష్యత్‌లో వరి ధాన్యాన్ని తగ్గించి చిరుధాన్యాలు పెంచేందుకు వన్‌ప్రాజెక్టు వన్ డిస్ట్రిక్ట్ కింద చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం అండర్ సెక్రటరీ అమిత్, సాహాయ్, హిమాన్స్ కొర్దే, స్టేట్ నోడల్ ఆఫీసర్ పద్మజ, నాబార్డ్ ఏజీఎం షణ్ముఖ ఆధ్వర్యంలో హన్వాడ మండలంలోని జొన్న పంటలను, బోయపల్లిలో ఆయిల్ ఫాం తోటను, గండీడ్‌లో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్, పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్ర ఏడీఆర్ మల్లారెడ్డి, డాట్ సైంటిస్ట్ భరత్‌భూషన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సాయిబాబ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

హన్వాడ: మండలంలోని నాగిసోనిపల్లిలో కేంద్ర బృందం పర్యటించింది. గ్రామంలో రాగిపంట సాగును పర్యవేక్షించారు. కేంద్ర బృందం సభ్యులు అమిత్, సాహాయ్, హిమాన్స్ కొర్దే, స్టేట్ నోడల్ ఆఫీసర్ పద్మజ, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ గ్రామంలో రాగి పంటలు, రైతుల పంట సాగుచేసే విధానంలో అవలంబిస్తున్న తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీహెచ్‌వో సాయిబాబ, ఏవో కిరణ్, ఏఈవో రమేష్, రాజేష్, ఆనంద్ స్వామి, నాగన్న, రైతులు పాల్గొన్నారు.


రొట్టె తయారి పరిశీలిస్తున్న బృందం సభ్యులు

గండేడ్‌లో ప్రాసెసింగ్ యూనిట్ సందర్శన

గండేడ్: మండలంలోని చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. అక్కడ తయారు చేస్తున్న జొన్నరొట్టెలు, మురుకుల తయారీని పరిశీలించారు. భవిష్యత్‌లో వరి ధాన్యం తగ్గించి చిరుధాన్యాలను పెంచేందుకు వన్‌ప్రాజెక్టు వన్ డిస్ట్రిక్ట్ కింద చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్, పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్ర ఏడీఆర్ మల్లారెడ్డి, డాట్ సైంటిస్ట్ భరత్‌భూషన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సాయిబాబ పాల్గొన్నారు.

చందా కోసం వెళ్తే.. కండువా కప్పారంటా..!

బీజేపీలో చేరికపై కాంగ్రెస్ కౌన్సిలర్ స్పందన


బీజేపీ కండువా కప్పుకొని పార్టీలో చేరిన కౌన్సిలర్ రాధాకృష్ణ

వనపర్తి టౌన్: బీజేపీ జిల్లా కార్యాలయానికి వచ్చి పార్టీలో చేరిన ఓ కౌన్సిలర్.. ఆ తర్వాత వాట్సాప్‌లో స్పందిస్తూ.. బలవంతంగా కండువా కప్పారని పేర్కొన్న సంఘటన వనపర్తిలో చర్చనీయాంశమైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ మంగళవారం బీజేపీ యువమోర్చ జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మాతృ సంస్థ బీజేపీలోకి తిరిగి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తీరా సాయంత్రానికి ఆయన మాట మార్చేశారు. తాను పార్టీ మారలేదని, దుర్గమ్మ చందా కోసం వెళ్తే బలవంతంగా కండువా కప్పారని వాట్సప్‌లో పేర్కొనడం గమనార్హం.


నిషేధిత అలివి వలల పట్టివేత



చిన్నంబావి: నిషేధిత అలివి వలలతో చేపలు పడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి కృష్ణానది పరివాహక ప్రాంతంలో గాలింపు చేపట్టారు. మండలంలోని కాలూరు వద్ద కృష్ణానదిలో నిషేధిత అలివి వలలతో చేపల వేట కొనసాగిస్తున్న వారిని పట్టుకొని స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ చెప్పిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ జిల్లాకు చెందిన కొంతమంది నిషేధిత అలివి వలలతో చేపల వేట కొనసాగిస్తున్నారని సమాచారం రావడంతో వారిని పట్టుకొని అలివి వలను సీజ్ చేశామన్నారు. వారిపై కేసును నమోదు చేసినట్లు తెలిపారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఎవరైనా నిషేధిత అలివి వలలతో చేపలు పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజ్యాంగ ఫలాలు అందరికి దక్కాలి

• డీటీఎఫ్ మహాసభల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగ ఫలాలు అందరికి సమానంగా దక్కాల్సిన అవసరముందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభల చివరి రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలో ప్రజలదరూ సమానమేనని ప్రస్తావన ఉంది, కానీ ఇన్నేళ్లు ప్రభుత్వాలు ఎందుకు సమానత్వాన్ని సాధించలేకపోయాయని ప్రశ్నించారు. దేశంలో ప్రజలకు కులాలు, మతాల వారీగా గుర్తించి న్యాయం చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు సామాజిక న్యాయం చేయడం లేదన్నారు. సమాజంలో వనరులు ఒకటి రెండు కులాల చేతులో కేంద్రీకృతమై ఉన్నాయని, ప్రజల ఆస్తులను ప్రభుత్వాలు దారదత్తం చేయడం సరైంది కాదన్నారు. అశ్రిత పక్షపాతం, బంధుప్రీతితో అడ్డగోలుగా భూములు ఇచ్చుకుంటే పోతే సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చే మోసపూరిత వాగ్దానాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. ప్రజల లక్ష్యాలను సాధించాలంటే కేవలం ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ పాత్రికేయుడు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, కార్యదర్శి లింగారెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, ఆదిత్య పాల్గొన్నారు.

నేషనల్‌గేమ్స్‌లో చాంపియన్‌గా నిలవాలి


తెలంగాణ నెట్‌బాల్ జట్లతో డీవైఎస్‌ఓ శతదితరులు

• జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్
• గోవా తరలిన తెలంగాణ నెట్‌బాల్ జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ నెట్‌బాల్ జట్లు ప్రతిభ చాటి చాంపియన్లుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి, శాట్ పరిశీలకులు ఎస్.శ్రీనివాస్ అన్నారు. గోవా రాష్ట్రం పంజింలో ఈనెల 22 నుంచి 27 వరకు జరిగే 37వ నేషనల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుష, మహిళా జట్లతో పాటు ఫాస్ట్–5 రాష్ట్ర మహిళా జట్లకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ప్రత్యేక కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. శిక్షణ శిబిరాన్ని మంగళవారం డీవైఎస్‌ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా నెట్‌బాల్ జట్లను అభినందించారు. జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. గతేడాది జరిగిన నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ పురుషుల జట్టు ద్వితయ స్థానంలో నిలిచిందని, ఈ సారి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ నెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 19 వరకు తెలంగాణ నెట్‌బాల్ జట్లకు కోచింగ్ నిర్వహించినట్లు తెలిపారు. 19న తెలంగాణ జట్లు నేషనల్ గేమ్స్‌కు వెళుతారని తెలిపారు. తెలంగాణ నెట్‌బాల్ అసోసియషన్ అధ్యక్షుడు విక్రం ఆదిత్య రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్, కోచ్ అంజద్, సోహైల్ ఉర్ రహెమాన్, రాంమోహన్, సునీల్‌కుమార్, ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

తెలంగాణ పురుషుల జట్టు: జన్ను హరీష్, కంబల శ్రీనివాసరావు (మహబూబబాద్), పి.వంశీకృష్ణ, కె.సుమన్ (హైదరాబాద్), ముజీబుద్దీన్, మహ్మద్ జక్వాన్‌ఖాన్, హబీబ్‌ఖాన్ (మహబూబ్‌నగర్), పి.దిలీప్‌కుమార్ (ఖమ్మం), సి.రాజీవ్ (వరంగల్), కె.సంతోష్ (నారాయణపేట), ఈ.ప్రకాశ్ (మేడ్చల్), ఆర్.ధనూష్ నాయక్ (నల్గొండ).

మహిళా జట్టు: ఎం.మౌనిక, ఎస్.అఖిల, ఎం.గౌతమి (ఖమ్మం), సంగీత, శ్రిష్టి ఠాకూర్ (రంగారెడ్డి), బి.శిరీష రాణి, వరలక్ష్మి (మేడ్చల్), నేనావత్ అరుణ, సాయిచైత్ర (మహబూబ్‌నగర్), కాత్రావత్ ప్రియాంక (నారాయణపేట), గంగోత్రి మేఘన (హైదరాబాద్), సౌమ్యరెడ్డి (జగిత్యాల).

ఫాస్ట్–5 మహిళా జట్టు: ముస్కాన్ బేగం (మహబూబ్‌నగర్), సమిత, ఝాన్సీ, నందిని (ఖమ్మం), జి.లితిష, గోపి చంద్రిక, యశశ్రీ (మేడ్చల్), పి.స్ఫూర్తి (మెదక్), అనూష (వరంగల్), సింధూజ (హైదరాబాద్).

మరణంలోనూ వీడని మిత్రబంధం


ఘటనా స్థలంలో ఉదయ్‌కుమార్ మృతదేహం

మక్తల్: కలిసి తిరిగిన ఇద్దరు స్నేహితులు ఇంట్లో చెప్పకుండా బయటకు వచ్చి మృత్యుఒడికి చేరారు. స్కూటీని కర్ణాటక బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన సంఘటన నారాయణపేట జిల్లా గుడిగండ్లలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. హైదరాబాద్‌లోని గొలిగూడకు చెందిన ఉదయ్‌కుమార్(28) ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతనికి అంబర్‌పేటకు చెందిన అఖిల్ (26)తో పరిచయం ఏర్పడింది. అఖిల్ ఐటీఐ ఫెయిల్ అయ్యి ఖాళీగా ఉంటున్నాడు. అయితే సోమవారం రాత్రి ఉదయ్‌కుమార్, అఖిల్ ఇద్దరు కలిసి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా స్కూటీపై హైదరాబాద్ నుంచి బయలుదేరి మక్తల్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గుడిగండ్ల దగ్గర రాయచూర్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న కర్ణాటక బస్సు ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టడంతో ఉదయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా.. అఖిల్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108లో అఖిల్‌ను మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అనంతరం సమాచారం అందుకున్న ఎస్‌ఐ పర్వతాలు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఉదయ్‌కుమార్ మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అఖిల్ తల్లి ఉమ, ఉదయ్‌కుమార్ తండ్రి మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.